నామినేషన్లకు రెడీ!

నేటి నుంచి స్వీకరణ

- సికింద్రాబాద్‌లో రెడ్ అలర్ట్
- జీహెచ్‌ఎంసీలో ఎన్నికల సెల్ ఏర్పాటు
- ప్రతి కదలికా వీడియో రికార్డింగ్

సికింద్రాబాద్: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ఈనెల 18 (నేడు) నుంచి ప్రారంభం కానుంది. 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, పరిశీలన వంటి కార్యకలాపాలు నిర్వహించేందుకు సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ కమిషనర్ కార్యాలయాన్ని ఎన్నికల కార్యాలయంగా ఎంపిక చేశారు. నామినేషన్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం కోసం అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించుకున్నారు. పార్లమెంట్ సెగ్మెంట్ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ కోసం జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం మొదటి అంతస్తులో అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యవేక్షణలో సహాయక రిటర్నింగ్ అధికారి వీరారెడ్డి నేతృత్వంలో నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది.

రాజకీయ పార్టీలకు అవగాహన..

నామినేషన్ల ప్రక్రియ, ప్రచార సరళికి సంబంధించి అభ్యర్థులు పాటించాల్సిన పద్ధతులను ఇప్పటికే ఎన్నికల అధికారులు వివరించారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌ల రాజకీయ పార్టీల నాయకులు, సహాయ ఎన్నికల అధికారుల ప్రత్యేక సమావేశాన్ని రిటర్నింగ్ ఆఫీసర్ నిర్వహించారు. ఇందులో నామినేషన్ పత్రాలు పొందడం, దాఖలు చేయడం, ఉపసంహరించుకోవడం, పోలింగ్ ఏజెంట్ల నియామకం వరకు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు.

కంట్రోల్‌రూం ఏర్పాటు...

ఎంపీ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించడం, స్వీకరించిన మీదట అభ్యర్థుల ముందే ప్రాథమిక పరిశీలన చేసేందుకు ఎన్నికల విభాగం కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయం మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి అభ్యర్థులు జతచేసిన ధృవీకరణలు, నామినేషన్ పత్రంలో నమోదు చేసిన వివరాలు సరిపోల్చుకుంటున్నారు. అనంతరం సంబంధిత వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు కంట్రోల్ రూమ్‌లో సాంకేతికపరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

19వ తేదీకి ప్రాధాన్యం..

నామినేషన్ల ప్రక్రియ ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు కొనసాగనుంది. ఈనెల 19వ నామినేషన్లు వేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు నిర్ణయించుకున్నారు. బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ తదితరులు నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 21, 23 తేదీల్లో మరికొందరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా నామినేషన్ దాఖలు చేసేందుకు ఎన్నికల కార్యాలయానికి వచ్చే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎన్నికల, పోలీసు అధికారులు చెబుతున్నారు. అభ్యర్థుల నామినేషన్లు మొదలు, ప్రచార సరళి పూర్తయ్యే వరకు మొత్తంగా ప్రతీ కదలికను వీడియో రికార్డు చేస్తున్నామన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పండుగలా ఉప ఎన్నికలు..

113 ప్రాంతాల్లో 232 కేంద్రాలు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పండుగ వాతారణంలో నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ మధుకర్ నాయక్ తెలిపారు. గురువారం నుంచి కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభం కా నున్న నేపథ్యంలో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు మోడల్ పో లింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి అసెంబ్లీ పరిధిలో కొ న్ని మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఎన్నికల కమిషన్ సూచించిందన్నారు. అయితే కంటోన్మెంట్ పరిధిలో అన్ని పోలింగ్ కేంద్రాలను మోడల్ సెంటర్స్‌గా చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఆయా పోలింగ్ కేంద్రాల్లో 'స్వచ్ఛ త'కు ప్రాధాన్యమిస్తూ, పోలింగ్ కేంద్రాల్లో పండుగ వాతావరణాన్ని కల్పించనున్నామని వెల్లడించారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి మరీ ఓటింగ్ రప్పించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వేసవి దృష్ట్యా ప్రతీ సెంటర్‌లో టెంట్‌లు, తాగునీరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. కంటోన్మెంట్‌లో 113 ప్రాంతాల్లో 232 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని నియోజకవర్గం పరిధిలోని 90 శాతం ప్రాంతం కంటోన్మెంట్‌లో ఉండగా, 10 మాత్రం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉందన్నారు.

అగ్నిప్రమాదాలపై 'గాంధీ'లో మాక్ డ్రిల్



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రాజారావు

గాంధీఆస్పత్రి : అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్‌సేఫ్టీ పరికరాల వినియోగం తదితర అంశాలపై సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే తక్షణమే స్పందించాల్సిన తీరుతెన్నులు, ప్రమాదంలో చిక్కుకున్నవారిని రక్షించడం, గాయపడిన వారికి అందించాల్సిన ప్రథమ చికిత్స, వైద్యసేవలపై గాంధీ సెక్యూరిటీ, పారిశుద్ధ్య, నర్సింగ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గాంధీ ఆస్పత్రిలో ప్రతినెల అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 101కు డయల్ చేసి సమాచారం అందించాలని, ఫైర్‌సేఫ్టీ పరికరాలను వినియోగించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించాలన్నారు. రెండు వేల పడకల ఆస్పత్రిలో ఫైర్‌సేఫ్టీ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ వినయ్‌శేఖర్, ఆర్‌ఎంఓ-1 జయకృష్ణ, ముషీరాబాద్ ఫైర్‌సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మహ్మద్ ముస్తాఫా, ఫైర్‌మెన్లు అశోక్, సుజిత్, తివారీ, హేమంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మధ్యాహ్న మిత భోజనం



సనత్‌నగర్: బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం దిగ్విజయంగా కొనసాగుతుంది. శ్రీరామనవమి సందర్భంగా జలప్రసాదం దాత అయిన శ్యాంసుందర్‌రాజ్, బాలాత్రిపుర సుందరి ఆధ్వర్యంలో మధ్యాహ్నం మిత భోజన కేంద్రం వద్ద దాదాపు 200 మందికి వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథరెడ్డి బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాతలుగా ఎస్.నాగరేఖ విజయశ్రీ, ఆర్‌సీకుమాలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ పార్థసారధి, కృష్ణారెడ్డి, రామమూర్తి, ప్రసాద్, విఠల్‌రెడ్డి, బీకేఎం సత్యనారాయణ, ముత్తారెడ్డి, వీర్‌రాజు, అరవింద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన పలువురు పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ అభ్యర్థి శ్రీ గణేష్ తెలిపారు. బుధవారం బొల్లారం రిసాలబజార్‌కి చెందిన పలువురు శ్రీగణేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీగణేష్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ యువజన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారని చెప్పారు. సందీప్‌యాదవ్, యశ్వంత్ యాదవ్, మల్లేష్ యాదవ్, బన్నీ యాదవ్, సన్నీ యాదవ్, చందు యాదవ్, మాధవ్, అర్భజ్, వినయ్, మనీష్, దీపక్, రవికిరణ్ మధు నిఖిల్ అరవింద్ వినీత్ పాల్గొన్నారు.

సివిల్స్‌కు ఎంపికైన తరుణ్‌కు సన్మానం



బన్సీలాల్‌పేట్: కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని హైకోర్టు అడ్వకేట్ మంచాల లక్ష్మణ్ పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మంచన్‌పల్లికి చెందిన దయ్యాల తరుణ్(22) తొలి ప్రయత్నంలోనే 231 ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. దళిత వర్గానికి చెందిన తరుణ్ తల్లిదండ్రులు బాబయ్య, శశికళ దంపతులు వ్యవసాయ కూలీలు. కష్టాలను బుజ్జగిస్తూ..కన్నీళ్లు దిగమింగుతూ కష్టపడి చదివి సివిల్స్ సర్వీసుకు ఎంపికై ఆ కుటుంబంలో ఆనందం నింపారు. దయ్యాల తరుణ్‌ను బుధవారం మంచాల లక్ష్మణ్ ఘనంగా సత్కరించి మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డుకాదని తరుణ్ నిరూపించాడని లక్ష్మణ్ పేర్కొన్నారు.

ఓయూ విద్యార్థికి 545 ర్యాంక్



నరేంద్ర

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి పడాల్ నరేంద్ర సివిల్స్‌లో 545 ర్యాంక్ సాధించారు. ఆర్ట్స్ కాలేజీలోని పొలిటికల్ సైన్స్ విభాగంలో ఎంఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కోహెడకు చెందిన నరేంద్రను పలువురు అధ్యాపకులు అభినందించారు.

మహిళా విశ్వవిద్యాలయంపై పునఃసమీక్షించండి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంపై పునఃసమీక్షించాలని ఎన్వీవోస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధగంగా కోఠి మహిళా కాలేజీని ఓయూ నుంచి వేరుచేసి వర్సిటీని ఏర్పాటు చేసిందని 2021 నుంచి 2024 వరకు నిధులు ఇవ్వకుండా నియామకాలు చేపట్టకుండా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కోఠి మహిళ కాలేజీని తిరిగి ఓయూ పరిధిలోని తెచ్చి విశాలమైన ప్రదేశంలో కొత్తగా మహిళా వర్సిటీని ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.



పాల్‌బాల్ హనుమాన్ దేవాలయంలో జరిగిన సీతారామ కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్



హారతి ఇస్తున్న బాలాంజనేయస్వామి ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా



కల్యాణోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్, కార్పొరేటర్ సామల హేమ

రాములోరి కల్యాణం.. పులకించిన భక్తజనం

- భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి వేడుకలు
- కిక్కిరిసిన ఆలయాలు

శ్రీరామ నవమి వేడుకలను సికింద్రాబాద్, సతన్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాములు కల్యాణోత్సవం కనుల విందుగా సాగింది. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు చేశారు. ఆయా దేవాలయాల్లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొని కల్యాణోత్సవాన్ని వీక్షించారు. – సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



రెజిమెంటల్‌బజార్‌లో జరిగిన వేడుకలకు హాజరైన ఈటల



సనత్‌నగర్ భగత్‌సింగ్ గ్రౌండ్‌లో మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి



శ్రీపురి కాలనీలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న శ్రీలతశోభన్‌రెడ్డి దంపతులు



వేడుకల్లో పాల్గొన్న మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి దంపతులు



రసూల్‌పురాలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న టీఎన్. శ్రీనివాస్



సీతారాముల విగ్రహాలను తీసుకువస్తున్న భక్తులు



వేడుకలకు హాజరైన కార్పొరేటర్ కొంతం దీపిక



హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న సుచిత్ర శ్రీకాంత్



రామాలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ



శ్రీరామనవమి ప్రత్యేక పూజలో పాల్గొన్న కార్పొరేటర్ హేమ, ఆలయ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్ తదితరులు



రసూల్‌పురా అన్నానగర్‌లో శ్రీరాముడి కల్యాణోత్సవంలో పాల్గొన్న నివేదిత



మేడిబావిలో జరిగిన రాములవారి కల్యాణోత్సవానికి హాజరైన మేకల సారంగపాణి



అంబర్ నగర్‌లో కనుల పండుగగా శ్రీరామనవమి



వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నేతలు శ్యాంసుందర్‌గౌడ్, లింగంపల్లి నర్సింగరావు



తిరుమలగిరి జయలక్ష్మీ గార్డెన్స్ ఆవరణలో నిర్వహించిన కల్యాణోత్సవంలో రాఘవరెడ్డి, జంపన ప్రతాప్



ఎల్లమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు



జెకెకాలనీ మూడో వీధిలో కాంతులీనుతున్న మండలంలో సీతారాముల కల్యాణోత్సవం



సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో..



మోడల్‌కాలనీలో..



దాసాంజనేయ స్వామి దేవాలయంలో..

బీజేపీకే ఎమ్మార్పీఎస్ మద్దతు



మాట్లాడుతున్న శ్రీకిషన్ మాదిగ

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతిస్తోందని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీకిషన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో అధిక సంఖ్యాకులైన మాదిగలకే టికెట్ ఇవ్వాలంటూ కొన్ని రోజులుగా అన్ని పార్టీలకు డిమాండ్ చేస్తూ వచ్చామన్నారు. మాదిగల ఆవేదనను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ గుర్తించలేదన్నారు. ఈ రెండు పార్టీల నేతలు మాదిగ బస్తీల్లో ప్రచారానికి వస్తే తరిమికొడతామన్నారు. మంద కృష్ణ మాదిగ సైతం కంటోన్మెంట్ టికెట్‌ను మాదిగలకు ఇవ్వాలని కోరడంతో, బీజేపీ అధినాయకత్వం స్పందించి మాదిగ అభ్యర్థి టీఎన్ వంశ తిలక్‌కు కేటాయించిందన్నారు. తమ డిమాండ్‌కు అనుగుణంగా స్పందించిన బీజేపీకి ఎమ్మార్పీస్ మద్దతిస్తుందన్నారు. ఈ సమావేశంలో కళ్యాణ్ అజిత్, శ్రీకాంత్, రొట్టెల సునీల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ విజయం ఖాయం'



కాంగ్రెస్‌లో చేరిన షేక్ గౌస్

సనత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం ఖాయమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ సూచించారు. బేగంపేటకు చెందిన విశాల్ సూదం ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నేత షేక్‌గౌస్ బుధవారం దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, పథకాలను ఇంటింటికి వివరించి కాంగ్రెస్ గెలుపునకు పాటు పడాలన్నారు. ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు శ్రీనివాస్ రాజీనామా



శ్రీనివాస్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ ప్రాంతానికి చెందిన కార్మిక నాయకుడు, సంఘ సేవకుడు ఎక్కాల శ్రీనివాస్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. త్వరలో బీజేపీలో చేరనున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. త్వరలో కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరడానికి సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

అన్నదానం



సనత్‌నగర్: సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులతో పాటు అన్నార్తులకు బుధవారం సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం అన్నసమారాధన చేశారు. టి.జనార్దన్‌రావు, సుబ్రహ్మణ్యం జన్మదినాన్ని పురస్కరించుకుని తాతావారి రాజశేఖర్ సహకారంతో నాగోల్ మెట్రో ఎల్‌సీహెచ్ ట్రెజరర్ ఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాల నిర్వహణను చేపడతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

జన్మదిన వేడుకల్లో ఈటల



రసూల్‌పురా: క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి జన్మదిన వేడుకల్లో బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పాల్గొని కేశవరెడ్డికి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నేతలు బాబురావు, రాయల్‌కుమార్ సామల సత్తిరెడ్డి, మాచర్ల శ్రీనివాస్ పలువురు కాలనీ, బస్తీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు.